PRGI NO: TGTEL/25/A2356
మేకార్తి దినపత్రిక
సోమవారం 16-02-2026 | పేజీలు : 8 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 166 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

## మున్సిపల్ ఫలితాలపై పార్టీ నేతలతో సిఎం రేవంత్

- గెలిపించిన సీనియర్ మంత్రులకు అభినందనలు
- భద్రాద్రి కొత్తగూడెంపై కుదిరిన అవగాహన
- మేయర్ సిపిఐకి, డిప్యూటి మేయర్ కాంగ్రెస్‌కు
- సిఎం రేవంత్‌తో పల్లా వెంకట్ రెడి&ఢ భేటీలో నిర్ణయం



తెలంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. మనపట్ల ప్రజల నమ్మకం పెరిగేలా అభివృద్ధి సాగాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేయడమే కాకుండా.. నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను కైవసం చేసుకునే వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఫలితాలను బేరీజు వేసుకుని మరింతగా పార్టీని పటిష్టం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. హంగ్ అసెంబ్లీలు ఉన్నచోట వాటిని దక్కించుకునేలా వ్యూహాత్మకంగా కదలాలని అన్నారు. 2లో..

# రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

- అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణం
- ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటు



2లో..

# ఏపీపీఎస్సీలో అక్రమాలపై సిట్ ఏర్పాటు

అమరావతి: ఏపీపీఎస్సీలో అక్రమాల దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 27/2018 నోటిఫికేషన్ నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి 11న హైకోర్టులో రిట్ అపీల్, అనుబంధ పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఈ క్రమంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సీఐడీ ఐజీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది.

2లో..

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తులకు తెర



- తోకపార్టీలకే తోక పార్టీగా మారిన బిఆర్ఎస్
- సిపిఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం
- మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత

మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే..

2లో..

# శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఇంచార్జి కలెక్టర్

- వైద్య శిబిరం, మే ఐ హెల్ప్ యూ డెస్క్ ల పరిశీలన
- క్యూ లైన్లలోని భక్తులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్

మేకార్తి దినపత్రిక ఫిబ్రవరి -15 వేములవాడ

మహా శివరాత్రి జాతర సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామి వారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు చేశారు. ఆలయం ఆవరణం వద్ద వైద్య శిబిరం, మే ఐ హెల్ప్ యూ డెస్క్ లను పరిశీలించారు. వైద్య శిబిరంలో ఏ ఏ మందులు అందుబాటులో ఉన్నాయో పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లో సిబ్బంది తో మాట్లాడారు. అనంతరం క్యూ లైన్ల వద్ద భక్తులతో మాట్లాడి.. ఇక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వాలంటీర్లు నీటిని పంపిణీ చేస్తుండగా, పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, హెల్ప్ డెస్క్ బాధ్యులకు పలు సూచనలు చేశారు.

కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

బీమేశ్వర సదన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే కలిసి పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఇక్కడ ఆలయ




ఈఓ రమాదేవి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

2లో..




# మహాశివరాత్రి వేడుకలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి.

మెకార్తి దినపత్రిక ఫిబ్రవరి 15సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.



మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి దంపతులు.తొగుట మండలం రాంపూర్ గ్రామంలని కోటిలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు,అర్పిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వామివారి కృపాకటాక్షంతో దుబ్బాక నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, రాంపూర్ గ్రామ సర్పంచ్ రవీందర్, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# ఏపీ ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

- పర్యాటక రంగానికి రూ. 439 కోట్ల కేటాయింపు
- లక్షకు పైగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ఏడు యాంకర్ హబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం
- గోదావరి పుష్కరాల పనులకు రూ. 60 కోట్లు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పురోగతికి బాటలు వేసేలా ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాట్లాడిన ఆయన, పర్యాటక రంగానికి రూ. 439 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏడాదిన్నర కాలంలో రూ. 20,088 కోట్ల పెట్టుబడుల ద్వారా 1,22,637 ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమమైందని వివరించారు.

# సంపాదకీయం

## సమరీతిలో లేని ఇచ్చిపుచ్చుకోవడాలు!

అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య చర్చలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చాయి. ఉభయ దేశాల ప్రభుత్వాలు 2026 ఫిబ్రవరి 6న ఒక సంయుక్త ప్రకటన జారీ చేశాయి. 'అది ఏమిటి?'. ఇది ఆ సంయుక్త ప్రకటనకు యోగ్యమైన ప్రశ్న. ఆ సంయుక్త ప్రకటన అంతులేని ఊహాగానాలను పురిగొల్పింది. దానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత ప్రభుత్వం వాణిజ్య ఒప్పందం వివరాలను విపులంగా వెల్లడించకపోవడం వల్ల ఆ అనుమానాలు పెరిగాయేగానీ తొలగిపోలేదు, తగ్గలేదు. ఉభయ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎలా ఉండాలనే విషయాన్ని ప్రభావదాయకంగా నిర్ణయించిందీ, నిర్దేశించిందీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నది నిరాకరించలేని వాస్తవం. కనుక ఆ సంయుక్త ప్రకటనలోని అంశాలు అమెరికాకు ఆందోళన కలిగించకపోవచ్చు గానీ భారత్‌కు తప్పకుండా కలవరం కలిగిస్తున్నాయి. ఉభయ దేశాల మధ్య వాణిజ్య చర్చలలో పాల్గొన్న భారత్ ప్రతినిధులు గత ఏడాది తాము అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయమై సంప్రదింపులు జరుపుతున్నామని పదే పదే ప్రకటించారు. సమీప భవిష్యత్తులోనే అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనున్నదని భారత వాణిజ్య మంత్రి స్వయంగా అనేక మార్లు చెప్పారు. 2025 సంవత్సరాంతంలోగానే ఇండో--అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తప్పక ఖరారు అవుతుందని కూడా ఆయన ప్రకటించారు. తీరా కొద్దిరోజుల క్రితం సంయుక్త ప్రకటన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కాదు. అది ఒక మధ్యంతర ఒప్పందం కూడా కాదు; అది ఒక మధ్యంతర ఒప్పందానికి ఒక చట్రం మాత్రమే. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నాం సుమా!

సంయుక్త ప్రకటన జారీ అయిన తరువాత అమెరికా --భారత్ వాణిజ్య ఒప్పందం పరస్పర ప్రయోజనకరమని ఇరు పక్షాలూ ప్రకటించాయి. ఈ వాదన పాఠకుని ఇంగితాన్ని అవమానపరచడమే. సంయుక్త ప్రకటనను పైపైన పరిశీలించినా సదరు ఒప్పందం పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన లేనే లేదని స్పష్టమవుతుంది. ఇప్పుడు ఆ సంయుక్త ప్రకటనను నిశితంగా చూద్దాం: అమెరికా పారిశ్రామిక సరుకులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులలో చాలా వాటిపై భారత్ సుంకాలను పూర్తిగా తొలగిస్తుంది లేదా గణనీయంగా తగ్గిస్తుంది. ఇందుకు అనుగుణంగా భారత్ ఎగుమతులపై విధించే సుంకాలను అమెరికా (2025 ఏప్రిల్ 2న విధించిన 25 శాతం నుంచి) 18 శాతానికి తగ్గిస్తుంది. జౌళి ఉత్పత్తులు, వస్త్రోత్పత్తులు, చర్మ ఉత్పత్తులు, పాదరక్షలు, ప్లాస్టిక్స్, రబ్బర్, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ సామగ్రి, చేతి వృత్తుల ఉత్పత్తులు, నిర్దిష్ట యంత్రాలు మొదలైన భారతీయ సరుకులపై అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గనున్నాయి. మధ్యంతర ఒప్పందాన్ని విజయవంతంగా అమలుపరచిన తరువాత జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, ముత్యాలు, వజ్రాలు, విమానాల విడిభాగాలు మొదలైన వాటిపై సుంకాలను అమెరికా తొలగిస్తుంది. భారత్ సుంకాలు పూర్తిగా తొలగించవలసి ఉండగా అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తుంది-- ఇందులో సుంకాలు పరస్పర ప్రయోజనకరంగా ఉండేందుకు దోహదం చేసేది ఏమైనా ఉన్నదా?!

అమెరికా వైద్య పరికరాల వాణిజ్యంలోను, అమెరికా ఐసీటీ సరుకుల విషయంలో పరిమితులతో కూడిన లైసెన్సింగ్ విధానం రద్దు చేసేందుకు సుదీర్ఘకాలంగా ఉన్న అవరోధాలను తొలగించేందుకు భారత్ అంగీకరించింది. అమెరికా ఆహార, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై సుంకాలేతర అవరోధాలను తొలగించేందుకు కూడా భారత్ అంగీకరించింది. అయితే ఇందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవల్సిన బాధ్యత అమెరికాకు లేదు. సుంకాలేతర అవరోధాలను తొలగించడం భారత్ తప్పనిసరి బాధ్యత కాగా అటువంటి బాధ్యత అమెరికాకు లేదు! ఇది ఎలా పరస్పర ప్రయోజనానికి తోడ్పడుతుంది?; రాబోయే అయిదు సంవత్సరాలలో భారత్ 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ కోల్ (ఉక్కు తయారీలో ఉపయోగించే బొగ్గు)ను కొనుగోలు చేస్తుంది. గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, డేటా సెంటర్స్‌లో ఉపయోగించే ఇతర ఉపకరణాలు మొదలైన టెక్నాలజీ ఉత్పత్తుల వాణిజ్యాన్ని ఉభయ దేశాలు గణనీయంగా పెంపొందించుకున్నాయి. ప్రస్తావిత సరుకులు అన్నీ అమెరికా ఎగుమతులేకానీ, అమెరికా కొనదలుచుకున్న భారత్ ఉత్పత్తులు కావు. ఇటువంటి ఏకపక్ష వాణిజ్యం పరస్పర లబ్ధినిస్తుందా? సంయుక్త ప్రకటనతో పాటు జారీ చేసిన ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భారత్ చేపట్టనున్న 'ప్రధాన చర్యల' గురించి అమెరికా అధ్యక్షుడు ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు ప్రత్యక్ష, పరోక్ష కొనుగోళ్లను నిలిపివేసేందుకు, అమెరికా ఇంధన ఉత్పత్తుల కొనుగోళ్లకు, అమెరికాతో మధ్యంతర ఒప్పంద చట్రాన్ని రక్షణ రంగంలో సహకారానికి కూడా విస్తరింపజేసేందుకు భారత్ కట్టుబడి ఉన్నది. ఈ కారణంగా 2025 ఆగస్టు 6న భారత్ తనపై విధించిన 25శాతం అదనపు సుంకాన్ని ఉపసంహరించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు నిర్ణయం తీసుకున్నారు. మూడు కీలక అంశాలలో భారత్ నుంచి హామీ పొంది, అందుకు ప్రత్యుపకారంగా అమెరికా ఎటువంటి సానుకూల నిర్ణయాలు తీసుకోపోవడం పరస్పర ప్రయోజనకర సూత్రానికి అనుగుణంగా ఉన్నదా?

రష్యా నుంచి చమురు ప్రత్యక్ష లేదా పరోక్ష కొనుగోలును భారత్ పునఃప్రారంభిస్తే భారతీయ సరుకులపై 25శాతం దండనాత్మక సుంకం విధింపుతో సహా అదనపు కఠిన చర్యలు చేపట్టే విషయాన్ని అమెరికా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది: ఇది బెదిరింపు కాదా? 2026 ఫిబ్రవరి 6న ఉభయదేశాలు అంగీకరించిన వాణిజ్య ఒప్పందం రష్యా చమురు అనే నిర్దిష్ట అంశంపై ఆధారపడి ఉన్నది. భారత్ ఎట్టి పరిస్థితులలోను రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదు. అని అమెరికా నిర్దేశించింది. దాన్ని భారత్ అంగీకరించింది. అమెరికా బెదిరింపు, భారత్ విధేయత మధ్య పరస్పర ప్రయోజనాలకు తోడ్పడేది ఏమైనా ఉన్నదా?

## మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్‌అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

## ఏపీపీఎస్సీలో అక్రమాలపై సిట్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

సిట్‌లో మరో సభ్యుడిగా సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తిని నియమించారు. దర్యాప్తునకు సంబంధించి సోదాలు చేసేందుకు, ఆధారాల స్వాధీనానికి సిట్‌కు అన్ని అధికారాలు ఇచ్చారు. దర్యాప్తు అవసరాలకు ఏ ప్రభుత్వ శాఖ నుంచైనా అధికారుల నియామకానికి వెసులుబాటు కల్పించారు. ఈ ఏడాది మార్చి 16లోగా సిట్ తన నివేదికను హైకోర్టుకు సమర్పించాలని సూచించారు.

## మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

ఇందులో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చినా, నిజామాబాద్, కొత్తగూడెంలలో మేయర్ పదవులను దక్కించుకోవడంపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు. కొత్తగూడెంలో స్వతంత్ర అభ్యర్థులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కూడగట్టి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు. ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదిలావుంటే సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, భాజపా-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు

కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. అయితే భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ పోస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు. మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ 8 డివిజన్లను సొంతం చేసుకుంది. అయితే, వారంతా కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆ 8మంది కార్పొరేటర్లు స్పందించారు. మేయర్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం చెప్పిందే తమకు శిరోధార్యమంటూ తేల్చి చెప్పారు. పార్టీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అమ్ముడు పోయారంటూ చేసే ప్రచారం అవాస్తమంటూ వీడియో విడుదల చేశారు.


## బిజెపితో బిఆర్ఎస్ పొత్తులకు తెర

మొదటిపేజీ తరువాయి



కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

## రాష్ట్ర ప్రగతికి ప్రతిబింబం 2026-27 బడ్జెట్



గత ప్రభుత్వం వదిలిన రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమిస్తూ, అభివృద్ధి, సంక్షేమం, రైతు భరోసాకు ప్రాధాన్యతనిచ్చిన బడ్జెట్‌ను మంత్రి కొలుసు పార్థసారథి స్వాగతించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సారథ్యంలో ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గతంలో 4.41 శాతంగా ఉన్న రెవెన్యూ లోటును 1.11 శాతానికి తగ్గించామని, ద్రవ్యలోటును 3.84 శాతానికి నియంత్రించామని పేర్కొన్నారు. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టుల కోసం మూలధన వ్యయం రూ.48,697 కోట్లు ప్రతిపాదించినట్లు వివరించారు.

నీటిపారుదల రంగానికి రూ.18,229 కోట్లు కేటాయించి చింతలపూడి వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రాయలసీమలో నల్లమల్ల సాగర్, రూ.30,000 కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని కొనియాడారు. సంక్షేమ పథకాలకు రూ.91,529 కోట్లు కేటాయించామని, 67.27 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ రూ.4,000కు పెంచి, పాత బకాయిలతో సహా చెల్లించామన్నారు. ధరల స్థిరీకరణ, జల జీవన్ మిషన్ నిధులను రైతుల కోసం పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నట్లు చెప్పారు. అమరావతి నిర్మాణానికి రూ.57,868 కోట్ల పనులకు అనుమతులిచ్చామని, గృహనిర్మాణానికి రూ.6,250 కోట్లు కేటాయించి పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని తెలిపారు.

## ఏపీ ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి



పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం విప్లవాత్మక నిర్ణయమన్నారు. విశాఖపట్నం, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలో 7 యాంకర్ హబ్‌లు, 25 థీమాటిక్ సర్క్యూట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఏపీని బ్రాండ్ గా మార్చేందుకు విశాఖ ఉత్సవ్, అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్ వంటి 60 ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 2027 గోదావరి పుష్కరాల ముందస్తు పనులకు రూ. 60 కోట్లు కేటాయించామని, కేంద్ర సహకారం కూడా కోరుతామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న 6,036 కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## వ్యవసాయ బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయ శాఖకు రూ. 12,152.32 కోట్లు కేటాయించారు. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం కింద రైతులకు ఏటా రూ. 20 వేలు అందించేందుకు రూ. 6,600 కోట్లు ప్రతిపాదించారు. వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 139.65 కోట్లు, విత్తన రాయితీకి రూ. 240 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ. 208.05 కోట్లు కేటాయించారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం కింద 22.5 లక్షల పంపుసెట్లకు సబ్సిడీ కోసం రూ. 13,722 కోట్లు ప్రతిపాదించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు రూ. 14,276.89 కోట్లు కేటాయించి, పోలవరం, వెలిగొండ వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ఉద్యాన శాఖకు రూ. 1,123.86 కోట్లు ప్రతిపాదించగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టును సిద్ధం చేసినట్లు తెలిపారు. పశు సంవర్ధక శాఖకు రూ. 1121.26 కోట్లు, మత్స్య శాఖకు రూ. 523.52 కోట్లు కేటాయించారు. ఆక్వా రైతులకు రూ. 1,145 కోట్ల విద్యుత్ సబ్సిడీ అందించనున్నారు. పశువుల గుర్తింపు కోసం 'గో-ఆధార్' పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. మార్కెటింగ్ శాఖ ద్వారా ధరల స్థిరీకరణ నిధికి రూ. 500 కోట్లు కేటాయించారు. ఎన్టీఆర్ జలసిరి కింద ఉచిత బోర్లు, మోటార్ల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ బడ్జెట్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## రూ.1,60,504 కోట్ల విలువైన పనులకు కేబినేట్ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504 కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం

పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది. బ్రహ్మపుత్ర నది కింద రైల్వేలైన్, నేషనల్ హైవే కోసం టన్నెల్‌ని నిర్మించనుంది. అలాగే కసారా-మన్మాడ్ మూడు, నాలుగో రైల్వేలైన్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీ- అంబాల మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బళ్లారి-హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో 3, 4 రైల్వేలైన్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ.3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ , నారాయణపేట, రాయచూర్, దేవరకద్ర, హైదరాబాద్‌కు ఈ కనెక్టివిటీ ఉంది. హైదరాబాద్-పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3175 కోట్ల ఖర్చు చేయనుంది. దమాసియా- బిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లను ఖర్చు చేయనుంది. గోతి- ట్రిమ్బక్ - పాల్ఘర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం రూ.3320 కోట్లని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

# చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

- ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్
- 17న"ఛలో సమాచార భవన్"కు పిలుపు

మేకార్తి దినపత్రిక
హైదరాబాద్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన "ఛలో సమాచార భవన్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం(సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వహకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్దతిని తుంగలో తోక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



# కుల మతాలకు అతీతంగా మానవత్వాన్ని చాటుదాం

- మత సామరస్యానికి నిదర్శనం



మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు మీదుగా శ్రీశైలం కాలినడకన వెళు_న్న శివ స్వాములకు ముస్లిం యువకులు ఘనంగా సేవలను అందించడం మానవత్వాన్ని చాటి చెప్పింది. హజ్రత్ నిరంజన్ షావలి గంధోత్సవం కమిటీ ఆధ్వర్యంలో శివ భక్తులకు పండ్లు మరియు మంచినీటి బాటిల్లను పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా అచ్చంపేట పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముంతటి నారాయణ శివ స్వాములకు పండ్లు మరియు మంచినీరు పంపిణీ చేశారు. శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా రాత్రి అని హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగలు శివరాత్రి కూడా ఒకటి అని తెలిపారు. ముస్లిం యువకులు చేపట్టిన ఈ కార్యక్రమం కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని మరియు స్నేహ భావాన్ని చాటి చెప్పింది. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ అలీ ఇంతియాజ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో వెనుకంజలో ఉన్న అచ్చంపేట మున్సిపాలిటీ

- ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలోఅధికారులు

మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్ళ లో




అచ్చంపేట మున్సిపాలిటీ వెనుకంజలో ఉంది. 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లు మంద కొండిగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ 20.28 లక్షల వ్యయం లక్ష్యంగా ఉండగా ఇప్పటివరకు రూ 10.65 లక్షల రూపాయలు మాత్రమే వసూలు అయింది. ఇంకా రూ 9.63 లక్షల రూపాయల బకాయిలు ఉన్నాయి. ఈ సంవత్సరం మార్చి తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో అధికారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజు పశువులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు మరియు మున్సిపాలిటీ యాజమాన్యం చెప్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు మరియు కౌన్సిలర్లు అదేవిధంగా మున్సిపాలిటీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శివ స్వాములకు వివేకానంద యూత్ ఆధ్వర్యంలో పాల పంపిణీ

- శివనామస్మరణతో మారుమోగుతున్న నల్లమల అటవీ ప్రాంతం



మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో పాల పంపిణీ చేయడం జరిగింది. నల్లమల్ల అడవి ప్రాంతమంతా శివ నామస్మరణతో మార్మోగుతుంది. మహాశివరాత్రి సందర్భంగా శివ స్వాములు పాదయాత్ర ద్వారా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి వెళుతున్నారు. పాదయాత్ర ద్వారా శ్రీశైలం వెళ్లే శివ స్వాముల కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు అన్నదానం మరియు పండ్ల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాదయాత్ర చేసే శివ స్వాములకు అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోనీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో యువకులు పాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు సంపంగి శేఖర్, మాదుగుల పవన్, పిట్టల రాకేష్, బిక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల్ల వాసికి దక్కిన అరుదైన గౌరవం

- రామ్ చరణ్ యువశక్తి తరపున పేదలకు ఫుడ్ డొనేషన్



మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం నల్లమల్ల ప్రాంత వాసికి మహానగరంలో అరుదైన గౌరవం దక్కింది. వివరాల్లోకి వెళితే అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామానికి చెందిన ఇంద్రకంటి మారుతి (ముతామేస్త్రి) రామ్ చరణ్ యువశక్తి తరపున పేదలకు ఫుడ్ డొనేషన్ అలాగే ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం లాంటి కార్యక్రమాలు చేపట్టాడు. ఈ కార్యక్రమాలను వీక్షించిన మెగాస్టార్ చిరంజీవి అతని సేవలను మెచ్చుకొని తన స్వగృహానికి పిలిచి అభినందించడం జరిగింది. ఒక్క తెలంగాణ లోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదవారికి సహాయం చేయడంలో నల్లమల్ల ప్రాంతం వెనకాడదని ఇంద్రకంటి మారుతి నిరూపించారు. తాను చేస్తున్న సహాయ సహకారాలకు వారి గ్రామస్తులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

# 108 వాహనాలను జిల్లా మేనేజర్ అకాస్మిక తనిఖీ

- మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచన



మేకార్తి దినపత్రిక
తెలంగాణ ప్రభుత్వం 108 సేవలతో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న 108 వాహనాలను నాగర్ కర్నూలు జిల్లా 108 మేనేజర్లు శ్రీనివాస్ మరియు శ్రీహరిలు అచ్చంపేటలో రికార్డులను పరిశీలించిన తదుపరి వాహనాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజానీకానికి నిరంతరం (అనగా 24 గంటలు 365 రోజులు) అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లతో పాటు పైలట్లు అజయ్ కుమార్, శ్రీరామ్, ఎంటీ మల్లేష్ మరియు 108 వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

- విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రయత్నం



మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిందని ఎస్ఎఫ్ఐ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎండి సయ్యద్ తెలిపారు. సందర్భంగా ఎండి సయ్యద్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ లు నిర్వహించామని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు అన్ని అన్ని రంగాలలో ప్రతిభ కనబరచాలని సూచించారు. విద్యార్థులకు పదవ తరగతి తమ గమ్యస్థానానికి తొలిమెట్టు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి సయ్యద్ తో పాటు స్థానిక నాయకులు రామ్ చరణ్ మరియు పృథ్వీరాజ్, చరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశం

- ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు స్టాఫ్ నర్సులు ఆరా మెడికల్ సిబ్బందితో డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దావకానాలను బలోపేతం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా హాస్పిటల్లో వైద్యులు స్టాక్ నర్సులు పారామెడికల్ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. హాస్పిటల్లో రోగులకు కావలసిన మందులు సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయి అనే అంశంపై ఎమ్మెల్యే చర్చించారు. నల్లమల ప్రాంతంలో ఎంతోమంది పేద బలహీన బడుగు వర్గాల కు చెందిన ప్రజలు ఎక్కువగా ఉన్నారని వారు వివిధ రోగాల గురించి హాస్పిటల్ కు వస్తే ఎవరైనా వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

# శ్రీ కృష్ణ భగవాన్, గరుత్మంతుడి విగ్రహా, ధ్వజస్తంభ ప్రతిష్టాపన

- ఐదు రోజులపాటు కోలాటాలు భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు

మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలో శ్రీ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత





శ్రీ కృష్ణ భగవాన్ మరియు గరుత్మంతుడి విగ్రహా, ధ్వజస్తంభ ప్రతిష్టాపన జరగనుంది. ఈనెల 22 నుండి 26వ తేదీ వరకు ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22వ తేదీన విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించి 23వ తేదీన హోమం, 24వ తేదీన క్షీరాభిషేక హోమం దేవత ఆహ్వానం, జలాధివాసం అదేవిధంగా 25వ తేదీన కలశ అభిషేకం, మంత్రమూర్తి కుంభ వాహనం కార్యక్రమాలు ఉంటాయని 26వ తేదీన విగ్రహా ప్రతిష్టాపన జరుగుతుందని శ్రీ కృష్ణ దేవాలయ ఉత్సవ కమిటీ మరియు యాదవ సంఘం పెద్దలు తెలిపారు. ఐదు రోజులపాటు కోలాటాలు, భజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునున్నాయి కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాదవ సంఘం నాయకులు జిఎన్ఆర్ ఆదిత్య స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ యాదమ్మ హలరాజ్ తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయని లిఫ్టు.... రోగుల అవస్థలు

- వెంటనే మరమ్మత్తులు చేయించాలని ఆదేశించిన ఎమ్మెల్యే

మేకార్తి దినపత్రిక
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గత నెల రోజులుగా లిస్టు పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి పై అంతస్తులకు వెళ్లేందుకు వీల్ చైర్లు, స్ట్రక్చర్ సౌకర్యం ఉన్న లిఫ్ట్ పనిచేయకపోవడంతో వారు మెట్ల మార్గాన్ని ఆశ్రయిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్నవారు ఇతరుల సహాయం కోరి మెట్లు ఎక్కుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా కూడా లిఫ్ట్ పనిచేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడంతో విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ వెంటనే మరమ్మత్తులు చేయించాలని ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాసులును ఆదేశించారు.



# శాయంపేటలో మత్స్యశాఖ కులసంఘం సేవా కార్యక్రమం

**మరణించిన పొన్నాల నితిన్ కుటుంబానికి అండగా 50 కేజీల బియ్యం అందజేత**



మేకార్తి దినపత్రిక
శాయంపేట(హ) గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పొన్నాల నితిన్ కుటుంబ సభ్యులను మత్స్యశాఖ కుల సంఘం నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక, మానసిక ధైర్యం నింపేలా 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రతి కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఎవరికైనా ఇలాంటి పరిస్థితులు ఎదురైతే సంఘం ముందుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కుల సంఘ అధ్యక్షులు జూల రమేష్, కమిటీ సభ్యులు ఇండ్ల మొగిలి, జూల చంద్రమోహన్, నీరటి కుమారస్వామి, పొక్కుల సదానందం, జూల వెంకన్న, బోనాల శివ, జూల తరుణ్, పొక్కుల శశి, నీరటి నాగరాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గీసుకొండలో సైన్స్ - క్రీడలల్లో విద్యార్థుల జైత్రయాత్ర

**– టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభా వికాసం... సీఎం కప్‌లో విజయఢంకా**



మేకార్తి దినపత్రిక
గీసుకొండ విద్యార్థులు సైన్స్, క్రీడా రంగాల్లో వరుస విజయాలతో జైత్రయాత్ర కొనసాగిస్తున్నారు. చదువులోనూ, క్రీడల్లోనూ సత్తా చాటుతూ మండలానికి కీర్తి తెస్తున్నారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా జడ్పీఎచ్ఎస్ గీసుకొండలో మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సుభాష్ అధ్యక్షతన, మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ విశ్వేశ్వర్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సబితా పర్యవేక్షణలో పోటీలు విజయవంతంగా జరిగాయి. పోటీల్లో 8వ తరగతి విద్యార్థి బరిగెల శ్రీకర్ గీసుకొండ మొదటి స్థానం సాధించాడు. గంగాదేవిపల్లి పాఠశాల విద్యార్థిని కే. నిత్యశ్రీ ద్వితీయ స్థానం, ఎం. సారిక తృతీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, సైన్స్ విద్య ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తుందని, సమస్యల పరిష్కారంలో దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో నీట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు ఇది బలమైన పునాది అవుతుందని వివరించారు. ఇక క్రీడా రంగంలోనూ గీసుకొండ విద్యార్థులు విజయపతాకం ఎగురవేశారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో కబడ్డీ బాలికల విభాగంలో డి. సృజన, కేజియా పాల్, కే. చందన, డి. పూజ, కె. స్మైలీ విజయం సాధించారు. బాలుర వాలీబాల్ విభాగంలో డి. యశ్వంత్ వర్మ, కోటా ప్రిన్స్, దౌడు సుశాంత్ గెలుపొందారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రిన్స్, బన్నీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో వారు ప్రతిభ చాటనున్నారు. విజేతలను ప్రధానోపాధ్యాయులు సుభాష్, పీడీ శ్రీనివాస్, గ్రామ పెద్దలు అభినందించారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని, విద్య--క్రీడల్లో సమాన శ్రద్ధ పెడితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సూచించారు. సైన్స్‌లో ప్రతిభ... క్రీడల్లో విజయం... గీసుకొండ విద్యార్థులు రెండు రంగాల్లోనూ సత్తా చాటడం విశేషం.

# న్యాయవాదిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**– న్యాయవాది హత్య పట్ల ఖండన**
**– తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి**
**– జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



మేకార్తి దినపత్రిక
కొత్తగూడెం లీగల్, హైదరాబాద్ అత్తాపూర్ లో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని,హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు,తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.శనివారం ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం లేకపోవడం మూలంగా న్యాయవాదులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.ఇంకా ఎంతమంది న్యాయవాదులపై దాడులు జరిగి,ఎంతమంది న్యాయవాదులు చనిపోయిన తర్వాత న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేస్తారని ప్రశ్నించారు.15రోజుల వ్యవధిలో రాష్ట్రంలో ఇద్దరు న్యాయవాదులు హత్యకు గురికావడం హేయమన్నారు.న్యాయవాదులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడులుగా అభివర్ణించారు.న్యాయవాదులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని,హోమ్ శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాంతి భద్రతల విషయంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ముగిసిన పాత పంటల జాతర డిడిఎస్ అంటేనే చిరుధాన్యాల ప్రయోగశాల



మేకార్తి దినపత్రిక
ఝరాసంగం మండలంలోని మజ్నూర్ గ్రామ శివారులలో నిర్వహించిన పాత పంటల జాతర ముగింపు సభలో దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ అంటేనే చిరుధాన్యాల ప్రయోగశాల అని రాష్ట్ర రైతు సంక్షేమ చైర్మన్ కమిషన్ అని కోదండ రెడ్డి మాట్లాడారు. 26వ పాత పంటల జాతర ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నీటి కాలంలో మహిళలు ఇలాంటి చిరుధాన్యాల వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఈనాటికి ఈ సొసైటీలో చిరుధాన్యాల ప్రాధాన్యత ఉందని తెలిపారు. రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడడం వల్ల మనం తీసుకునే ఆహారం కూడా నాణ్యతను కోల్పోయి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఫలితంగా ప్రతి రైతు తమ వ్యవసాయ భూమిలో పాత పద్ధతులను వినియోగించి పంటలు పండించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆ విధంగా రైతులకు పాత పద్ధతిలో పంటలు పండించే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలి అని పేర్కొనడం జరిగింది. కార్యక్రమంలో తహసిల్దార్ భాస్కర్, సర్పంచ్ మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ బిక్షపతి, సంధ్యారాణి, గోపాల్, నందకిషోర్, రామ్ రెడ్డి, నరసింహారెడ్డి, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రకు దిక్సూచి ఈ బడ్జెట్

## ప్రజల ఆశల ప్రతిబింబం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

మేకార్తి దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పక్కా ప్రణాళిక అని నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య కొనియాడారు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 3,32,205 కోట్ల భారీ బడ్జెట్‌పై ఆమె హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు చీకటి నుంచి వెలుగులోకి గత ప్రభుత్వం మిగిల్చిన 9.74 లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమించి కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపింది ఇది కేవలం పద్దుల ప్రకటన కాదు అగాధం నుంచి ఆకాశం వైపు రాష్ట్రం వేస్తున్న ధైర్యవంతమైన ముందడుగు అని ఆమె పేర్కొన్నారు ఆర్థిక మంత్రి వరుసగా మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆయన సమర్థతకు నిదర్శనమని ఆమె అభినందించారు బడ్జెట్ ముఖ్యాంశాలు విశ్లేషణ మహిళా సాధికారత తల్లికి వందనం పథకానికి 9,668 కోట్ల కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి తల్లికి ప్రభుత్వం అండగా నిలిచింది రైతు సంక్షేమం అన్నదాత సుఖీభవ కు 6,600 కోట్లు కేటాయించడం రైతు పక్షపాతి ప్రభుత్వాన్ని ప్రతిబింబిస్తోంది. సామాజిక న్యాయం బిసి సంక్షేమానికి 23,650 కోట్లు సామాజిక సంక్షేమానికి 11,118 కోట్లు కేటాయించడం ద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టమైంది అభివృద్ధి వికేంద్రీకరణ అమరావతికి 6,000 కోట్లు విశాఖ ఆర్థిక ప్రాంతానికి 28,000 కోట్లు రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు 30,000 కోట్లు కేటాయించడం రాష్ట్ర ప్రాంతీయ సమతుల్యతకు నిదర్శనం యువతకు ఊతం పాఠశాల విద్యకు 32,308 కోట్లు స్కిల్ డెవలప్‌మెంట్‌కు 1,232 కోట్లు కేటాయించడం యువత భవిష్యత్తుకు బలమైన పునాది ఇలా ప్రతి రంగానికి తగిన విధంగా నిధులు కేటాయించబడ్డ ఈ బడ్జెట్ కు విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ యువనేత శ్రీ లోకేష్ మరియు ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ ప్రత్యేకంగా నందిగామ ప్రజల తరపున ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ధన్యవాదాలు తెలిపారు



# గంభీరావుపేట మార్కండేయ దేవాలయంలో శివ కళ్యాణం

మేకార్తి దినపత్రిక ఫిబ్రవరి 15 గంభీరావుపేట మండల రిపోర్టర్
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో స్థానిక మార్కండేయ దేవాలయంలో అంగరంగ వైభవంగా శివ కళ్యాణం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జంగం విద్యాసాగర్, గ్రామ పురోహితులు రాచర్ల పార్థసారశర్మ గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ మల్లు గారి పద్మ వార్డు సభ్యులు దేవసాని కృష్ణ, పిట్ల శ్రీమతి పద్మశాలి సంఘ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



# గంభీరావుపేట మార్కండేయ దేవాలయంలో శివ కళ్యాణం



మేకార్తి దినపత్రిక ఫిబ్రవరి 15 గంభీరావుపేట మండల రిపోర్టర్
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో స్థానిక మార్కండేయ దేవాలయంలో అంగరంగ వైభవంగా శివ కళ్యాణం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జంగం విద్యాసాగర్, గ్రామ పురోహితులు రాచర్ల పార్థసారశర్మ గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ మల్లు గారి పద్మ వార్డు సభ్యులు దేవసాని కృష్ణ, పిట్ల శ్రీమతి పద్మశాలి సంఘ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల్లో ఓడిన గెలిచినా సిపిఎం ప్రజల పక్షమే వెంకట్ గౌడ్..

మేకార్తి దినపత్రిక
కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలకు సహకరించిన ప్రజలకు పార్టీ శ్రేణులకు అందరికీ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ తరపున వెంకట్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిపిఎం పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తుందని సిపిఎం పార్టీకి ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించిన గెలిపించకపోయిన నిరంతరం కార్మిక, రైతు, నిరుపేద, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని కామారెడ్డి జిల్లాలో ఇప్పటికి అనేక పోరాటాలు నిర్వహించిందని భవిష్యత్తులో కూడా అలాంటి పోరాటాలు నిర్వహిస్తామని ప్రజా సమస్యలపై ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకై కార్మిక రైతు హక్కులకై పోరాటాలు నడుపుతామని ఈ పోరాటాలకు ప్రజలు సిపిఎం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి సభ్యులు వెంకట గౌడ్,మోతిరాం నాయక్ కొత్త నరసింహులు ముదాం అరుణ్, పాల్గొన్నారు.




# శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ల్యాదెళ్ళ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



మేకార్తి దినపత్రిక
శ్రీరామ్ ఫౌండేషన్ చైర్మన్ గురిజాల శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో దామెర మండలం ల్యాదెళ్ళ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేల్పుల రాజ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇటువంటి సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.
10వ తరగతి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న శ్రీరామ్ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గండు ముఖేష్, అన్నేబోయిన రోహిత్, జక్కుల శ్రీకాంత్, నన్నేబోయిన శ్రీను, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు భద్రయ్య, శ్రీనివాస్, పురేందర్, రఘురాం, అనిల్ కుమార్, ఫాతిమా మేడం విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న జరిగే నిరాహార దీక్షను జయప్రదం చేయండి

**- జిల్లా ఉపాధ్యక్షుడు అంజా గౌడ్**



మేకార్తి దినపత్రిక
నారాయణఖేడ్ పట్టణంలో అంబేద్కర్ భవనం లో కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న జరిగే నిరాహార దీక్షను జయప్రదం చెయ్యండి. ఈరోజు నారాయణఖేడ్ పట్టణంలోకల్లుగీత కార్మిక సంఘం నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నరసింహ గౌడ్ అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు గౌడ సోదరులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బడ్జెట్లో గౌడ కులస్థుల సంక్షేమం కోసం గీత కార్మికుల ఉపాధి కోసం 5000 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాదులోనీ ఇందిరాపార్క్ వద్ద కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆద్వార్యాంలో నిరహారదీక్ష నిర్వహించడం జరుగుతుందనీ ఈ యొక్క నిరాహార దీక్షకు జిల్లా లోని గౌడ సోదరులు గీతా కార్మికలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచారు రాష్ట్ర గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయడం లేదని ఇచ్చిన వారికి 4 వేల పెన్షన్ ఇస్తామని ఇచ్చిన ఆమెని అమలు చేయాలని దరఖాస్తు చేసుకున్న గీత కార్మికులందరికీ కొత్త పెన్షన్ మంజూరు చేయాలి పెండింగ్ లో ఉన్న ఎనిమిది వందల మందికి సుమారు 14 కోట్ల ఎక్స్రేషియను వెంటనే విడుదల చేయాలని గత బడ్జెట్లో కేటాయించిన 70 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు గీత కార్మికుల ఉపాధి కోసం గౌడ కులస్తుల సంక్షేమం కోసం జరిగే ఈ నిరాహార దీక్ష లో అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు నరసింహ గౌడ్ జయ రామచంద్ర గౌడ్ విట్టల్దాస్ గౌడ్, భూమా గౌడ్ బాగా గౌడ్ అంజాగౌడ్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# ఢిల్లీలో ఓసిల మహా ధర్నాను విజయవంతం చేయాలి

**- ధర్నా పోస్టరును ఆవిష్కరించిన ఓసి నేతలు**

మేకార్తి దినపత్రిక
ఓసి ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23 న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఓసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్నలు తెలిపారు. ధర్నా పోస్టరును శనివారం ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య నాయకులు జగిత్యాల లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కిషన్ రెడ్డి, రాజన్న లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఓసిల స్థితి గతులను అధ్యయనం చేసి జాతీయ స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల్లోని ఆర్థికంగావెనుక బడి ఉన్నవారు రిజర్వేషన్లు లేమి కారణంగా అటు సంక్షేమ పథకాలఫలాలు ఇటు రాజకీయ పదవులు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్దంగా ఏర్పడ్డ 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పై రాజకీయ పబ్బం కోసం కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద ఓసి లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని



పేర్కొన్నారు. అంబెద్కర్ ఆలోచన విధానశీ ప్రకారం వెనుకబడిన తరగతుల వారికి పదేళ్ళ వరకు రిజర్వేషన్లు అమలుచ్చేయాలని అంటే 70 ఏళ్ళు దాటినా వాటిని అలానే కంటిన్యూ చేయడం వల్ల ఓసిలకు తీరని అన్యాయం జరుగుతున్నదాన్నారు. జనరల్ స్థానాల్లో కూడా ఓసి లకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వక పోవడం వల్ల రాజకీయంగానూ వెనుక బడి పోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేసేందుకు జాతీయ ఈడబ్ల్యూఎస్ కమిషన్ను ఏర్పాటు చేయాలని కిషన్ రెడ్డి, మహంకాళి రాజన్నలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసి జేఏసీ జగిత్యాల జిల్లా ఓసి నాయకులు సిరిసిల్ల వేణుగోపాల్, సిరిసిల్ల రాజేందర్ శర్మ, సంత గౌతమ్ రెడ్డి, పుల్లూరి సత్యనారాయణ, మేతే ఉమాపతి శర్మ, కటకం చంద్రమౌళి, అయిల్నేని స్వప్న రావు, దేవరశెట్టి జనార్దన్, బండారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
31

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక నూతన ఒరవడి ఆత్మీయతతో కూడిన నాయకత్వం

**- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

మేకార్తి దినపత్రిక
ఎన్టీఆర్ జిల్లా కూటమి నేతలు ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్య ఐటీ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ తన ఉండవల్లి నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమం ఒక మరపురాని అనుభవంగా మిగిలిపోయింది స్వయంగా లోకేష్ అందరినీ స్వాగతం పలకడం ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా మాట్లాడుతూ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకోవడం సరదాగా గడుపుతూ భోజనం పంచుకోవడం ఇవన్నీ కేవలం రాజకీయ సమావేశం కాకుండా ఒకే కుటుంబ సభ్యులుగా భావించేలా చేశాయి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ అపూర్వమైన ఆత్మీయతను అనుభవించారు ఇంతటి ఆత్మీయత పంచే నాయకులతో పార్టీ ప్రయాణం చేయడం నా ఆనందం అదృష్టంగా భావిస్తున్నాను అని తంగిరాల సౌమ్య తెలిపారు ఇది కేవలం ఒక విందు కాదు రాజకీయాల్లో కుటుంబ బంధాలు సమన్వయం ఆత్మీయతను పెంపొందించే ఒక వినూత్న సంప్రదాయం బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోకేష్ ప్రారంభించిన ఈ డిన్నర్ డిప్లొమసీ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తోంది పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు వారి కుటుంబాలు ఒకే వేదికపై ఆత్మీయంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసే దిశగా ఇది ఒక



మంచి అడుగు ఇలాంటి నాయకత్వం ఇలాంటి ఆత్మీయత ఆంధ్రప్రదేశ్కు మరింత బలమైన భవిష్యత్తును తెస్తుందని ఆశిస్తున్నాం

# సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయాలి

**- బాదావత్ భాస్కర్ నాయక్..**

మేకార్తి దినపత్రిక



చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామంలో గోర్ సేన బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు గ్రామంలోని స్థానిక దుర్గమ్మ దేవాలయం ఆవరణలో గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధుల సమక్షంలో 287వ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని, గోర్ సేన మండల అధ్యక్షులు బాదావత్ భాస్కర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15,16 తేదీలలో జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతిని కుల మతాల పార్టీలకతీతంగా సహకరించి ఈ మహోత్తర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ధరావత్ కిషన్, భూక్య గోపాల్ నాయక్, ఆంగోత్ భద్రయ్య, బాదావత్ మేఘ్యు, రాజేందర్ హనుమ, బద్రు, మైబు,మోహన్ హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. బంజార గిరిజనుల అందరిని ఏకతాటి పైకి తీసుకురావడానికి గిరిజనులను సన్మార్గంలో నడిపించడానికి సేవాలాల్ మహారాజ్ భక్తి భావంతో దైవంగా కొలిచి మెలగాలన్న ఉద్దేశంతో జయంతి కార్యక్రమాన్ని కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించుటకు గ్రామ ప్రజలు సహకరించాలని సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడిచి నాంది పలకాలని ఆయన తెలిపారు.

# సేవా లాల్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించాలి

**- గోర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ.. ధరావత్ కిషన్ నాయక్..**

మేకార్తి దినపత్రిక



నర్సంపేట మండలం కేంద్రం లో గోర్ సేన నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ధరావత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. గోర్ బంజారా గిరిజన లంబాడీ ల ఆరాధ్య దైవం, బంజారా సంఘ సంస్కర్త అయిన సద్గురు సేవలాల్ మహారాజ్ 287 వ జయంతి ని ఫిబ్రవరి 15 నుండి జళ్ భోగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన గోర్ బంజారా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోర్ సేన మీడియా వింగ్, గోర్ గవన్య లు నర్సంపేట మున్సిపాలిటీ లో ఉన్నటువంటి సేవాలాల్ మహారాజ్ కు వచ్చేటువంటి భక్తుల కొరకు ప్రాంగణంను మున్సిపాలిటీ జెసిబి తో చదును చేయించినారు. అదే విధంగా ప్రతి తండాలో గోర్ బంజారా సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించాలని ప్రతి ఒక్కరు సేవాలాల్ మహారాజ్ ఆశయాల కోసం పని చేయాలని తండాలలో ఉన్న యువతను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోర్ సేన మీడియా వింగ్ ఇంచార్జ్ భూక్యా వెంకన్న నాయక్, గోర్ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బోడ బాబునాయక్, గోర్ సేన జిల్లా కార్యకర్తలు బానోతు లాల్ కుమార్ నాయక్, తేజవత్ లవణ్ నాయక్, లావుడ్య రమేష్ నాయక్, భూక్యా రమేశ్ నాయక్ ,భాస్కర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట మునిసిపల్ చైర్మన్ గా గౌడ్ ను నియమించాలి

**- మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్..**

మేకార్తి దినపత్రిక
నర్సంపేట నియోజకవర్గంలో బీసీల లో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన గౌడ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని మునిసిపల్ చైర్మన్ పదవిగా నియమించాలని గౌడ జన హక్కుల పోరాట



సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణ గౌడ సంఘ భవనంలో మోకుదెబ్బ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 40 వేలకు పైగా గౌడ కులస్తులన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం అత్యధికముగా సర్పంచ్ లు గౌడ కులస్తులు ఎన్నిక కావడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో మెజారిటీ గౌడ కులస్తులు కాంగ్రెస్ పార్టీ కి మద్దతుగా నిలవడం జరిగిందన్నారు. నియోజకవర్గ కేంద్ర మైన నర్సంపేట మునిసిపల్ చైర్మన్ గా గౌడ కులస్తుని నియమించడం వల్ల రాబోయే ఎం పిటీసీ, జెడ్పిటీసీ ఎన్నికల్లో గౌడ సామాజిక వర్గం మద్దతుతో మెజారిటీ స్థానాలు గెలుపుకు గౌడ సంఘం మద్దతు తెలుపుతుందన్నారు. ఈ నెల 16 న జరిగే నర్సంపేట మునిసిపల్ చైర్మన్ ఎన్నికలో గౌడ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని రమేష్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశం లో మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు సొల్తీ సారయ్యగౌడ్, గండి లింగయ్యగౌడ్, రామగోని సుధాకర్ గౌడ్, గోడిశాల సదానందంగౌడ్, గోపగాని వెంకట్ గౌడ్, కందుల శ్రీనివాస్ గౌడ్,జనగాం మల్లికార్జున్ గౌడ్, పుల్లూరి కుమారస్వామిగౌడ్, పోశాల రాజు కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అరెపల్లిలో మెరిడియన్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఇనగాల

**- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

మేకార్తి దినపత్రిక
అరెపల్లిలో మెరిడియన్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు,మెరిడియన్ స్కూల్ చైర్పర్సన్ మాధురి ఆహ్వానం మేరకు కుడా (కూడా) చైర్మన్ మరియు



హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి (వరంగల్ వెస్ట్)తో కలిసి ఆరేపల్లి లోని మెరిడియన్ స్కూల్ నూతన బ్రాంచ్ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మెరిడియన్ స్కూల్ చైర్పర్సన్ మాధురి శుభాకాంక్షలు తెలియచేస్తూ ఉన్నతమైన ప్రమాణాలతో, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతూ, బ్రాంచ్ ద్వారా మరెందరో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు.

# కోరిన కోరికలు తీర్చే సంగమేశ్వరుడు ప్రధాన అర్చకులు దాములూరి శ్రీనివాస శర్మ



మేకార్తి దినపత్రిక
మహాశివరాత్రి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయం లో దర్శనానికి వచ్చే భక్తులకు దేవాలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు అత్యంత వైభవోపేతంగా ఉత్సవాలు జరుగుతాయి వైరా ఏరు కట్టలేరు సంగమేశ్వరుడు కలిసి కూడలి దక్షిణ కాశీగా విరాజిల్లుతున్నది మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శనం చేసుకోవాలని కోరుతున్నాము

# సర్కార్ బడికి వాటర్ ప్యూరిఫైయర్ విరాళం.

**- సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య..**

మేకార్తి దినపత్రిక
చెన్నారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, హెడ్ మాస్టర్, విద్యార్థుల విన్నపం మేరకు గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి, రూ.30,000 విలువైన వాటర్ ప్యూరిఫైయర్ను విరాళంగా అందజేశారు. పాఠశాలలో శుద్ధమైన మరియు సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ



ప్యూరిఫైయర్ను ఏర్పాటు చేయడం జరిగింది. దీని ద్వారా విద్యార్థులు ప్రతిరోజూ పరిశుభ్రమైన నీటిని పొందగలరని తెలిపారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ మానుపాటి పాపమ్మ , ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు సర్పంచ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని వారు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి మరియు విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని సర్పంచ్ తెలిపారు.

# నిజాయితీకి పట్టాభిషేకం.. ప్రజా యోధుడికి గౌరవ వందనం!

మేకార్తి దినపత్రిక



నిస్వార్థ ప్రజా ప్రతినిధి.. ప్రజా పోరాటాల యోధుడు!
పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు.. నిరాడంబరతకు నిలువుటద్దం!
నేటికీ ఉద్యమమే ఊపిరిగా, ప్రజలే ప్రాణంగా, అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, మన అందరి పెద్దలు గుమ్మడి నరసయ్య, చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారి నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భం మనందరికీ గర్వకారణం."పదవులు రావచ్చు.. పోవచ్చు.. కానీ ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానం శాశ్వతం."ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచినా, సామాన్య రైతులా, సామాన్య ప్రయాణికుడిలా బ్రతుకుతున్న మీ జీవనశైలి నేటి తరానికి ఒక గొప్ప పాఠం. మీకు ఈ గౌరవ డాక్టరేట్ రావడం, ఆ పురస్కారానికే ఒక గౌరవం!

# దురదృష్టవశత్తు అనారోగ్యంతో మృతిచెందిన రాము గారి కుటుంబానికి అండగా వైద్య విధాన పరిషత్ ఫర్మాసిస్ట్ అసోసియేషన్

మేకార్తి దినపత్రిక

సెప్టెంబర్ 2023 లో ఫార్మసిస్ట్ గా జోగిపేట్ ఏరియా హాస్పిటల్ లో విధులలో చేరి దురదృష్ట వశాత్తూ అనారోగ్యంతో మృతిచెందిన రాము గారి సతీమణి శ్రీమతి మంజుల గారికి వారి కూతురి పేరుమీద 1,50,000 రూపాయలు పోస్ట్ ఆఫీస్ ఫిక్స్ డిపాజిట్ చేసి, వైద్య విధాన పరిషత్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ తరపున సంగారెడ్డి డా.షరీఫ్ గారి సమక్షంలో



అందించడం జరిగింది.అలాగే జోగిపేట హాస్పిటల్ సిబ్బంది ద్వారా 43,000 రూపాయలకు సంబంధించిన డిపాజిట్ పత్రాలు కూడా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సౌజన్య గారు అందించడం జరిగింది. కారుణ్య నియామకం ద్వారా వారి కుటుంబాన్ని ఆదుకోవలసిందిగా సంబంధిత అధికారులను కోరడం జరిగింది.అకాల మరణంతో కష్టంలో ఉన్న ఆ కుటుంబానికి ఒకింత ఓదార్పు ఇవ్వాలన్న సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సహృదయంతో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మీా డా. అశోక్,నర్సింగ్ సూపరింటెండెంట్లు శ్రీమతి పూలమాంబ,సునంద, ఫార్మసిస్ట్ యూనియన్ నాయకులు సోమమల్లన్న,పాండు, పరాబ్ కుమార్,రామారావు,శివకుమార్,సెల్వరాణి ,ఇంకా ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒకటవ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి ఎల్ అనసూయ గెలుపు.

మేకార్తి దినపత్రిక



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మున్సిపాలిటీలోని 1వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అనసూయ తన సమీప ప్రత్యర్థి అయిన (బీఆర్ఎస్) అభ్యర్థిపై 272 ఓట్ల తేడాతో గెలుపొందారు.ఈ విజయంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థిని అభినందిస్తూ సంబరాలు జరుపుకున్నారు. తనపై నమ్మకం ఉంచిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

# రైతులకు ఎప్పీఓ సభ్యత్వంతో మేలు వీరేశం..

మేకార్తి దినపత్రిక



కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఎన్.డి.సి.సి. బ్యాంక్ ఆధ్వర్యంలో రైతుల కోసం ఎఫ్. పి .ఓ. (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) సభ్యత్వ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్.డి.సి.సి. బ్యాంక్ అధికారి వీరేశం మాట్లాడుతూ. ఈ.పి.ఓ.లో సభ్యత్వం వల్ల మార్కెటింగ్ సౌకర్యాలు, న్యాయమైన ధరలు, ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ రుణ సౌకర్యాలు సులభంగా అందుతాయని, సంఘటితంగా ఉంటే రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తదితరులు రైతులు పాల్గొని సభ్యత్వం నమోదు చేసుకున్నారు.

# అనీమియా బాధితుడికి సకాలంలో రక్తం అందజేత..

- 25 వ సారి రక్తదానం చేసిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

మేకార్తి దినపత్రిక



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న గడ్డమీది బాపు రావు కి ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ప్రైవేటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ 25 వసారి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐ.వి.ఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు లు 200 మందికి పైగా ఉన్నారని ఆ చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉందని ఆ చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని అన్నారు.ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రక్తదాత శ్రీనివాస్ కి అభినందనలు తెలియజేసారు.

# కామారెడ్డి మున్సిపాలిటీలో పెరిగిన కాంగ్రెస్ బలం..

- షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలోకి భారీ చేరికలు

మేకార్తి దినపత్రిక



ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ సమక్షంలో పలువురు స్వతంత్ర కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చేరికలతో మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ పట్టు మరింత బిగుసుకుంది.?పార్టీలో చేరిన వారు:?కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ క్రింది వార్డుల స్వతంత్ర అభ్యర్థులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు:40వ వార్డు: ఎస్. నాగమణి భాస్కర్ గౌడ్ 38వ వార్డు: ఇప్ప ఉమా రాణి శ్రీనివాస్ ?3వ వార్డు: షేక్ బబ్లు వీరికి మహ్మద్ అలీ షబ్బీర్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.?మెజారిటీ దిశగా కాంగ్రెస్:?ఈ ముగ్గురు కౌన్సిలర్ల చేరికతో కామారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలం 22కు చేరుకుంది. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపై నమ్మకంతో ఉన్నారని, పట్టణ అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# రాంసాన్ పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు

మేకార్తి దినపత్రిక



శ్రీరస్తు శుభమస్తు ఓం నమ శివాయ
లిశ్రీశ్రీశ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఉత్సవాలు
శ్రీ శ్రీ శివకోటి శివాలయానికి సాయంత్రం 08:00 రథోత్సవం కార్యక్రమం ఉంటుంది గ్రా॥ రాంసానిపల్లి మం॥ అందోల్ సంగారెడ్డి జిల్లా
స్వస్తి శ్రీ విశ్వవాసు నామ సంవత్సర మాఘ కృ త్రయోదశి తేది: 15-02-2026 ఆదివారం రోజున మహాశివరాత్రి ఉపవాస దీక్షలు భ్రమరాంభ మల్లికార్జున స్వామి కి 11:00గ బోనాలు, 12:30 ని కి కళ్యాణ మహోత్సవం తర్వాత అన్నప్రసాదాలు కార్యక్రమం జరుపబడును. సా. 05:00 గం లకు అగ్ని గుండలు ఉంటాయి. తేదీ: 16-02-2026 సోమవారం నాడు జాతర బండ్లు తిరుగుట.
మరియు శ్రీ శ్రీ శివకోటి శివాలయానికి సాయంత్రం 08:00 రథోత్సవం కార్యక్రమం ఉంటుంది కావున గ్రామప్రజలందరు ఈ ఉత్సవములలో పాల్గొని కార్యక్రమము విజయవంతం చేసి శ్రీశ్రీశ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు.

# రాష్ట్ర స్థాయికి ఎంపికైన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని..

మేకార్తి దినపత్రిక



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి నందు ఎం.ఎస్.డి.ఎస్. సెకండ్ ఇయర్ చదువుతున్న ఎం. అమృత చీఫ్ మినిస్టర్ కప్ 2025 ఫ్రమ్ రూరల్ టు గ్లోబల్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారిచే నిర్వహించబడిన జావెలిన్ త్రో పోటీలో అండర్ 20 విభాగం లో డిస్ట్రిక్ట్ లెవెల్ లో గోల్డ్ మెడల్ సాధించి, స్టేట్ లెవెల్ కి ఎంపికయ్యింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.సి. శోభారాణి,వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, ఫిజికల్ డైరెక్టర్ రమాదేవి తో పాటు అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు అమృత ను అభినందించారు.

# సీఎం కప్‌లో నూకపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రభంజనం



మేకార్తి దినపత్రిక

శనివారం రోజున జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద స్టేడియంలో జగిత్యాల జిల్లా స్థాయి సీఎం కప్ ఆటల పోటీలలో అండర్-18 షాట్ పుట్ (గర్ల్స్) విభాగంలో చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలం నూకపెల్లి మోడల్ స్కూల్ విద్యార్థి సుల్తాన్ వైష్ణవి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది.. అలాగే అండర్-18 డిస్కస్ త్రో (గర్ల్స్) విభాగంలో కూడా సిల్వర్ మెడల్ తో ద్వితీయ స్థానం సాధించడం జరిగింది విద్యార్థినిని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గుమ్మడి ఆదిత్య, పిజికల్ డైరెక్టర్ మల్యాల రమేష్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు

# ఆ గ్రామ జిపిఓ అందరికీ ఆదర్శం..

మేకార్తి దినపత్రిక



కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో జిపిఓగా విధులు నిర్వహిస్తున్న పరిగి స్వామి గ్రామంలో విధులు నిర్వహిస్తూ అందరి జిపిఓలకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. కానీ కొందరు జిపిఓ లు వచ్చాం పోయమన్నట్టు ఉంటారు కానీ భూంపల్లి జిపిఓ మాత్రం ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 3 గంటల వరకు గ్రామపంచాయతీలోనే ఉంటూ గ్రామస్తులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకుంటూ గ్రామంలోనే అందుబాటులో ఉండడం పట్ల భూంపల్లి గ్రామస్తులు భూంపల్లి జిపిఓ స్వామిని గ్రామస్తులు అభినందించారు గ్రామ పరిపాలనాధికారిగా కాకుండా ఒక గ్రామ సేవకుడిగా పనిచేస్తున్న జిపిఓ స్వామి గ్రామంలో ఏ కార్యక్రమమైనా ముందుంటు జిపిఓ స్వామి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

# ఖాదర్ పేట మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి.

మేకార్తి దినపత్రిక







వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఖాదర్ పేట ప్రధాన రహదారి శివారులో ఈరోజు తెల్లవారుజామున నిద్రమత్తులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని యువకుడి మృతి చెందాడు.స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి వరంగల్ పట్టణంలోని కరీమాబాద్ కు చెందిన బొమ్మగాని అనిల్ (35) మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పోగుళ్లపల్లిలో శుభకార్యానికి వెళ్లి ఈరోజు తెల్లవారుజామున వస్తుండగా ఖాదర్ పేట శివారులో రోడ్డు క్రాస్ ఉండడంవల్ల నిద్రమత్తులో రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొని పంట పొలాల్లోకి దూసుకెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించడం జరిగింది.

# మనభద్రాద్రి,, నూతన ప్రెస్ క్లబ్ ను. రిబ్బన్ కట్ చేసిప్రారంభించిన: ఎస్సై మేడ ప్రసాద్


మేకార్తి దినపత్రిక



మన భద్రాద్రి" ప్రింట్ ఒ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ ప్రెస్ క్లబ్ (రిజిస్ట్రేషన్ నెంబర్ :34/2026 )ను బూర్గంపాడు మండలం సారపాక ప్రాంతంలో శనివారం నాడు ఎడారి రమేష్ అధ్యక్షతన ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా... బూర్గంపాడు ఎస్సై మేడా ప్రసాద్, ఐటిసి కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, టిఎస్టియుసి హరి ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంగువ రమేష్, భజన ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు ప్రసాద్, మల్లారెడ్డి, రాంబాబు విచ్చేయడం జరిగింది. అనంతరం బూర్గంపాడు ఎస్సై మెడ ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి నూతన ప్రెస్ క్లబ్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మెడ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి అన్యాయాన్ని, సమస్యలను వార్తల ద్వారా తెలియజేయాలని విలువలతో కూడిన జర్నలిజాన్ని చూపించాలని తెలియజేశారు.అనంతరం అధ్యక్షుడు ఎడారి రమేష్ మాట్లాడుతూ, "న్యాయం పక్షాన మేము కట్టుబడి ఉంటాం. స్థానిక సమస్యలపై నిజాయితీగా వార్తలను రాయడం జరుగుతుందని, జర్నలిస్టుల సంక్షేమం, విలువలను కాపాడుకుంటాం" అని తెలిపారు.

# హరహర మహాదేవ...

## లోకకళ్యాణార్థం సాగే మహాశివరాత్రి వైభవం..



### – మహాశివరాత్రి పర్వదినం రోజున ఆలయాలపై ప్రజలకు చేరువ అందిస్తున్న ప్రత్యేక కథనం

**మేకార్తి దినపత్రిక**

ప్రకృతి ఆరాధనలో పరమశివుడికి ఉన్న స్థానం అద్వితీయం. మాఘ మాస బహుళ చతుర్దశి పర్వదినాన దేశవ్యాప్తంగా శివనామస్మరణ మారుమోగిపోతోంది. కేవలం ఒక పండుగగానే కాకుండా, మానవ పరిణామ క్రమంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించే గొప్ప పర్వదినంగా 'మహాశివరాత్రి'ని భక్తులు జరుపుకుంటారు. శివుడు అభిషేక ప్రియుడు మాత్రమే కాదు, జ్ఞాన ప్రదాత కూడా అని పురాణాలు ఘోషిస్తున్నాయి. అందులో భాగంగానే కింది ఆలయాల గురించి క్లుప్తంగా వాటి విశిష్టత గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

### కనిగిరి కొండపై వెలసిన శివ క్షేత్రంపై ప్రత్యేక కథనం.....

చారిత్రక నగరమైన కనిగిరి, ఆధ్యాత్మికతకు మరియు చారిత్రక వైభవానికి నిలయంగా భాసిల్లుతోంది. ఇక్కడి కొండపై వెలసిన పురాతన విజయ మార్తాండేశ్వర స్వామి ఆలయం స్థానిక ప్రజల ఆరాధ్య దైవంగానే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా భక్తులను ఆకర్షించే మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది. కనిగిరిని పూర్వం 'కనకగిరి' లేదా 'బంగారు కొండ' అని పిలిచేవారని, ఈ పట్టణ చరిత్ర విజయనగర సామ్రాజ్యంతో పాటు కాటమరాజు వంటి వీర పురుషుల గాథలతో ముడిపడి ఉందని చరిత్రకారులు చెబుతుంటారు. ఈ పురాతన ఆలయంలో వెలసిన శివలింగాన్ని దర్శించుకుంటే సకల రోగాలు, దోషాలు హరిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

?ఆలయ నిర్మాణ శైలి పరంగా చూస్తే, ఇది అప్పటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబంగా కనిపిస్తుంది. కొండపై వెలసిన ఈ శివాలయం నుండి చూస్తే కనిగిరి పట్టణ ప్రకృతి దృశ్యాలు భక్తులకు కనువిందు చేస్తాయి. ముఖ్యంగా కార్తీక మాసంలో మరియు మహాశివరాత్రి పర్వదినం వేళ ఈ ఆలయం భక్తి భావంతో పులకించిపోతుంది. ఆ రోజుల్లో నిర్వహించే ప్రత్యేక రుద్రాభిషేకాలు, జ్వాలాతోరణం మరియు రథోత్సవం వంటి కార్యక్రమాలు తిలకించడానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ క్షేత్రం కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, కనిగిరి దుర్గం యొక్క గత వైభవాన్ని చాటిచెప్పే చారిత్రక సాక్ష్యంగా నేటికీ నిలిచి ఉంది. అధికారుల సహకారంతో ఆలయ ప్రాంగణం మరింతగా అభివృద్ధి చెందుతూ, పర్యాటక రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది.

### – ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన ప్రాముఖ్యత విశిష్టత ప్రత్యేక కథనం
### – ప్రకృతి ఒడిలో పరమశివుని శిల్పకళా వైభవం:
### – ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా భైరవకోన

పడమటి కనుమల మధ్య విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతం అనంతమైన ఆధ్యాత్మిక రహస్యాలకు, అద్భుత శిల్పకళా సంపదకు నిలయంగా భాసిల్లుతోంది. ఈ అటవీ ప్రాంతంలోని సి.ఎస్. పురం మండలం అంబవరం సమీపంలో వెలసిన భైరవకోన క్షేత్రం ప్రకృతి ప్రేమికులను, భక్తులను ఏకకాలంలో మంత్రముగ్ధులను చేస్తోంది. ఎత్తైన పర్వత శ్రేణులు, జాలువారే జలపాతాలు, దట్టమైన వృక్షసంపద మధ్య కొలువుదీరిన ఈ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా భక్తుల నీరాజనాలు అందుకుంటోంది. ఇక్కడ ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కోనలో పల్లవ రాజుల కాలం నాటి అద్భుతమైన గుహాలయాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.భైరవకోన విశిష్టతను గమనిస్తే, ఇక్కడ ఒకే కొండను తొలిచి నిర్మించిన ఎనిమిది శివాలయాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన పల్లవ శిల్పకళా రీతిలో చెక్కబడిన ఈ గుహాలయాలు తమిళనాడులోని మహాబలిపురం శిల్పాలను తలపిస్తాయి. ఈ ఎనిమిది ఆలయాల్లో శశాంక భైరవుడు, గజ భైరవుడు వంటి అష్ట భైరవుల పేర్లతో పిలిచే శివలింగాలు కొలువై ఉండటం వల్ల ఈ ప్రాంతానికి భైరవకోన అనే పేరు వచ్చింది. సాధారణంగా శివాలయాల్లో గర్భాలయానికి ఎదురుగా నంది విగ్రహం ఉండటం ఆనవాయితీ, కానీ ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే శివలింగాలకు అభిముఖంగా బ్రహ్మ, విష్ణువుల విగ్రహాలు చెక్కబడి ఉంటాయి. త్రిమూర్తుల స్వరూపంగా ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం భక్తులకు ఒక అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని మిగిలిస్తుంది.ఈ క్షేత్రం కేవలం ఆధ్యాత్మికతకే కాదు, ప్రకృతి వైవిధ్యానికి కూడా పేరుగాంచింది. కొండపై నుండి సుమారు 200 అడుగుల ఎత్తు నుండి నిరంతరం జాలువారే జలపాతం భక్తుల పాపాలను కడిగివేస్తుందని ప్రతీతి. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి నాడు ఈ క్షేత్రంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఆ రోజున చంద్రకిరణాలు నేరుగా గర్భాలయంలోని దుర్గాదేవి విగ్రహంపై పడటం ఇక్కడి విశిష్టతకు పరాకాష్ట. ఈ అద్భుతాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఇక్కడి ప్రశాంత వాతావరణం, పక్షుల కిలకిలరావాలు, జలపాతపు సవ్వడి పర్యాటకులకు మానసిక ప్రశాంతతను అందిస్తాయి.

దర్శన వేళల విషయానికి వస్తే, అటవీ ప్రాంతం కావడంతో భక్తుల భద్రత దృష్ట్యా ఉదయం 6:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మాత్రమే ఆలయ ప్రవేశానికి అనుమతి ఉంటుంది. రాత్రి సమయాల్లో ఇక్కడ వన్యప్రాణుల సంచారం ఉండే అవకాశం ఉన్నందున భక్తులు పగటి పూటనే దర్శనం ముగించుకుని తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.భైరవకోనకు చేరుకోవడానికి రవాణా సౌకర్యాలు మెరుగ్గానే ఉన్నాయి. మార్కాపురం జిల్లా కనిగిరి పట్టణం నుండి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి చేరుకోవడానికి కనిగిరి మరియు చంద్రశేఖరపురం నుండి నిరంతరం ఆర్టీసీ బస్సులు మరియు ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. రైలు మార్గంలో వచ్చే వారు ఒంగోలు లేదా మార్కాపురం రైల్వే స్టేషన్లలో దిగి అక్కడి నుండి రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించవచ్చు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, పల్లవుల కాలం నాటి శిల్పకళా నైపుణ్యాన్ని దర్శించుకోవాలనుకునే వారికి భైరవకోన ఒక ఉత్తమ పర్యాటక మరియు ఆధ్యాత్మిక గమ్యస్థానం

### ఆధ్యాత్మిక వైభవం: పొన్నలూరు మండలంలోని పుణ్యక్షేత్రం 'సంగమేశ్వరం'

ప్రకృతి ఒడిలో పునీతమై, ఆధ్యాత్మికతకు నిలయంగా వెలుగొందుతున్న పొన్నలూరు మండలంలోని సంగమేశ్వర క్షేత్రం భక్తుల పాలిట అక్షరాలా కల్పవల్లిగా విరాజిల్లుతోంది. చారిత్రక వైభవానికి, శిల్పకళా చాతుర్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయం, ప్రకృతి రమణీయత మధ్య కొలువుదీరి సందర్శకులకు అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తోంది. ప్రధానంగా మూడు నదుల పవిత్ర సంగమ ప్రదేశంలో ఈ ఆలయం వెలయడం వల్ల దీనికి 'సంగమేశ్వరం' అనే పేరు సార్థకమైంది. ఇక్కడి శివలింగం అత్యంత ప్రాచీనమైనదని, పరమశివుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. పురాణ కాలం నాటి విశేషాలు కలిగిన ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకోవడం వల్ల సకల పాపాలు తొలగిపోవడమే కాకుండా, కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఈ ప్రాంత ప్రజల నమ్మకం.?ఈ క్షేత్రంలోని కోనేరు మరియు ప్రశాంతంగా ప్రవహించే నదీ తీరం భక్తులకు అద్భుతమైన మానసిక ప్రశాంతతను ప్రసాదిస్తాయి. నిత్యం నదీ ప్రవాహ హోరు మధ్య కొలువైన సంగమేశ్వరుడు, ఈ మండలంలోనే అత్యంత శక్తివంతమైన దైవంగా పూజలందుకుంటున్నాడు. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, కనులపండువగా సాగుతాయి. ఆ సమయంలో పొరుగు జిల్లాల నుండి సైతం వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తమ భక్తిని చాటుకుంటారు.

?కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, పర్యాటక పరంగా కూడా ఈ ఆలయం విశేష గుర్తింపు పొందింది. ఆలయ నిర్మాణం మరియు చుట్టుపక్కల ఉన్న శిల్పకళా సంపద పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. స్థానిక సంస్కృతిలో అంతర్భాగమైన ఈ దేవాలయం, ప్రస్తుతం అభివృద్ధి పథంలో పయనిస్తూ భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలతో ఒక ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ పవిత్ర క్షేత్రం ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రకృతి ప్రేమికులకు కూడా ఒక అద్భుతమైన గమ్యస్థానంగా నిలుస్తోంది.

### ఆధ్యాత్మిక చైతన్యానికి నిలయం.. నందన మారెళ్ళ శివక్షేత్రం

మార్కాపురం జిల్లా కనిగిరి పశ్చిమ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభను వెదజల్లుతున్న పుణ్యక్షేత్రాలలో నందన మారెళ్ళ శివాలయం అత్యంత విశిష్టమైనది. ప్రకృతి ఒడిలో, ప్రశాంతమైన వాతావరణంలో వెలసిన ఈ ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ క్షేత్రం జిల్లాలోనే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇక్కడి శివలింగం మహిమాన్వితమైనదని, భక్తితో కొలిచే భక్తుల కోర్కెలను స్వామి వారు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఈ ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే భక్తులకు అద్భుతమైన మానసిక ప్రశాంతత లభిస్తుంది. చుట్టూ కొండలు, పచ్చని ప్రకృతి దృశ్యాల మధ్య వెలసిన ఈ క్షేత్రం పర్యాటక పరంగానూ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించే ఉత్సవాలు కన్నులపండువగా సాగుతాయి. ఆ రోజున తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహిస్తారు. శివరాత్రి రోజున నిర్వహించే ప్రభల ఉత్సవం, రథోత్సవం తిలకించేందుకు కనిగిరి నియోజకవర్గంతో పాటు సుదూర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివస్తారు.?కార్తీక మాసంలో నందన మారెళ్ళ క్షేత్రం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోతుంది. వనభోజనాలు, కార్తీక దీపోత్సవాలతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగుతుంది. గ్రామస్థుల సహకారంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు ఇక్కడికి వచ్చే యాత్రికులకు ఎంతో వెసులుబాటును కలిగిస్తున్నాయి. పురాతన కట్టడాలు, శిల్పకళా చాతుర్యం ఉట్టిపడేలా ఉండే ఈ ఆలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు విశేష కృషి చేస్తున్నారు. కనిగిరి మండలంలోని ఈ పవిత్ర శివక్షేత్రం కేవలం ఒక పూజా స్థలంగానే కాకుండా, హిందూ ధర్మ ప్రచారానికి, సామాజిక ఐక్యతకుశ్రీ పట్టుగొమ్మలా నిలుస్తూ ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లుతోంది.

### అధ్యాత్మిక సౌరభం.. గిద్దలూరు శైవ క్షేత్రాల అపూర్వ వైభవం

చాళుక్యుల శిల్పకళా చాతుర్యానికి, పురాణ గాథలకు నిలయంగా నియోజకవర్గ శివాలయాలు

మార్కాపురం జిల్లా గిద్దలూరు పశ్చిమ ప్రాంతపు ముఖద్వారంగా వెలుగొందుతున్న గిద్దలూరు నియోజకవర్గం అపారమైన ఆధ్యాత్మిక సంపదకు, చారిత్రక వారసత్వానికి నెలవుగా నిలుస్తోంది. నల్లమల అటవీ శ్రేణుల పాదాల చెంత కొలువై ఉన్న ఈ ప్రాంతం, ప్రాచీన కాలం నుండి శైవ మతానికి ప్రధాన కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి ప్రతి శివలింగం వెనుక ఒక విశిష్టమైన పురాణ గాథ, ప్రతి ఆలయ స్తంభంపై ఒక అద్భుతమైన శిల్పకళా సౌందర్యం దాగి ఉండటం విశేషం. ముఖ్యంగా సత్యవోలు, మోక్షగుండం వంటి క్షేత్రాలు భక్తులకే కాకుండా, చరిత్ర పరిశోధకులకు కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

### చాళుక్యుల కళా వైభవం సత్యవోలు

గిద్దలూరు పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న సత్యవోలు గ్రామం ప్రాచీన భారతీయ వాస్తుశిల్ప శైలికి అద్దం పడుతోంది. ఏడవ మరియు ఎనిమిదవ శతాబ్దాలలో బాదామి చాళుక్యుల పరిపాలనలో నిర్మితమైన ఇక్కడి రామలింగేశ్వర మరియు భీమలింగేశ్వర స్వామి జంట ఆలయాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. భారత పురావస్తు శాఖ సంరక్షణలో ఉన్న ఈ ఆలయ సముదాయంలోని గోపురాలు, స్తంభాలపై చెక్కిన సూక్ష్మ రూపాలు అప్పటి శిల్పుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. గిద్దలూరు ప్రాంత చరిత్రను తెలుసుకోవాలంటే సత్యవోలును సందర్శించడం అనివార్యమని చరిత్రకారులు చెబుతుంటారు.పాప విమోచన క్షేత్రం మోక్షగుండం ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్న క్షేత్రం మోక్షగుండం. పురాణాల ప్రకారం పరశురాముడు తన మాతృహత్య దోషం నుండి విముక్తి పొందడానికి ఇక్కడి ముక్తేశ్వర స్వామిని ప్రతిష్ఠించి కఠోర తపస్సు చేశాడని, ఆ తపస్సుకు మెచ్చిన పరమశివుడు అతనికి 'ముక్తి'ని ప్రసాదించాడని స్థల పురాణం వివరిస్తోంది. అందుకే ఈ గ్రామానికి మోక్షగుండం అనే పేరు సార్థకమైంది. కేవలం ఆధ్యాత్మికమే కాకుండా, నవభారత నిర్మాతలలో ఒకరైన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి పూర్వీకుల మూలాలు ఈ పుణ్యభూమిపైనే ఉండటం గమనార్హం. ప్రతి ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారి అనుగ్రహం పొందుతుంటారు. ప్రకృతి ఒడిలో భీమలింగేశ్వరుడు నల్లమల అడవుల అంచున ప్రశాంత వాతావరణంలో వెలసిన కృష్ణంశెట్టిపల్లి భీమలింగేశ్వర స్వామి ఆలయం భక్తులకు అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. కొండపైన మరియు కింద వెలసిన ఈ జంట ఆలయాలు ప్రకృతి మరియు పరమాత్మ కలయికకు ప్రతీకలుగా కనిపిస్తాయి. ముఖ్యంగా కార్తీక మాసంలో మరియు మహాశివరాత్రి పర్వదినాల్లో ఈ క్షేత్రం భక్తుల హరోం హర నామస్మరణతో మారుమోగిపోతుంది. ఇక్కడ వెలసిన స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత

గిద్దలూరు నియోజకవర్గంలోని పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం మరియు జ్యోతి వంటి క్షేత్రాలు కూడా ఈ ప్రాంత ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయాలు మన సంస్కృతికి మూలస్తంభాలు. ప్రభుత్వం మరియు పర్యాటక శాఖ ఈ క్షేత్రాలపై మరింత దృష్టి సారించి, మెరుగైన వసతులు కల్పించినట్లయితే, గిద్దలూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం పుష్కలంగా ఉంది. మన పూర్వీకులు అందించిన ఈ అపురూప కట్టడాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

### – శైవ శాక్తేయాల సంగమ క్షేత్రం త్రిపురాంతకం
### – భక్తి పారవశ్యంలో ముంచెత్తుతున్న శ్రీశైల తూర్పు ద్వారం

త్రిపురాంతకం: మార్కాపురం జిల్లాలోని మార్కాపురం ప్రాంతంలో వెలసిన త్రిపురాంతక క్షేత్రం ఆధ్యాత్మిక చైతన్యానికి మరియు చారిత్రక వైభవానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. శ్రీశైల మహాక్షేత్రానికి ఉన్న నాలుగు ప్రధాన ద్వారాలలో తూర్పు ద్వారంగా ప్రసిద్ధి చెందిన ఈ పుణ్యస్థలి, అటు శివ భక్తులకు ఇటు శక్తి ఆరాధకులకు సమానమైన ప్రాముఖ్యత కలిగిన అరుదైన క్షేత్రం. పురాణ కాలం నుండి నేటి వరకు తన విశిష్టతను చాటుకుంటున్న ఈ ఆలయంలో పరమశివుడు త్రిపురాంతకేశ్వరుడిగా కొండపై కొలువై ఉండగా, కొండ దిగువన అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తుల పూజలందుకుంటున్నారు. రాక్షస సంహారం కోసం శివుడు ఇక్కడి నుండే బాణాన్ని ప్రయోగించినట్లు పురాణాలు చెబుతుండగా, ఆ విజయానికి సంకేతంగానే ఈ ప్రాంతానికి త్రిపురాంతకం అనే పేరు స్థిరపడింది.

ఈ క్షేత్రంలోని ప్రధాన ఆకర్షణ కొండపై వెలసిన స్వయంభూ లింగం. ఈ లింగం శిరస్సు భాగంలో ఒక చిన్న రంధ్రం ఉండటం, అందులో నుండి నిరంతరం జలధార ఊరుతూ ఉండటం ప్రకృతి సిద్ధమైన ఒక అద్భుతంగా భక్తులు భావిస్తారు. ఈ పవిత్ర జలాన్ని స్వీకరించడం వల్ల సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. ఇక్కడ శివలింగం కింద శ్రీచక్ర యంత్రం ప్రతిష్ఠించబడి ఉండటం వల్ల ఈ ఆలయానికి తాంత్రిక మరియు ఆధ్యాత్మిక పరంగా అత్యంత ప్రాముఖ్యత ఉంది. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న సుదీర్ఘమైన బిల మార్గం లేదా చీకటి గుహ మరొక రహస్యమయ విశేషం. ఈ గుహ మార్గం ద్వారా గతంలో మహర్షులు అంతర్లీనంగా శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేవారని, నేటికీ ఆ మార్గంలో సిద్ధపురుషులు సంచరిస్తుంటారని స్థానిక కథనాలు వినిపిస్తాయి.

దిగువన ఉన్న బాల త్రిపుర సుందరీ దేవి ఆలయం కూడా ఆధ్యాత్మిక శక్తికి నెలవు. దేవీ భాగవతంలో పేర్కొన్న అష్టాదశ శక్తి పీఠాలకు సమానమైన ప్రాముఖ్యతను ఈ క్షేత్రం కలిగి ఉంది. ఆదిశంకరాచార్యులు స్వయంగా ఈ క్షేత్రాన్ని దర్శించి ఇక్కడ శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. ఆలయ శిల్పకళా సంపద కాకతీయుల కాలం నాటి వైభవాన్ని గుర్తుచేస్తుంది. ముఖ్యంగా గణపతి దేవుడు మరియు రుద్రమదేవి కాలంలో ఈ ఆలయానికి పెద్ద ఎత్తున భూదానాలు, ఆభరణాలు సమర్పించినట్లు శిలా శాసనాలు సాక్ష్యమిస్తున్నాయి. ఆలయం చుట్టూ ఉన్న కదంబ వృక్షాలు ఈ ప్రాంతానికి ఒక రకమైన ప్రశాంతతను మరియు దివ్యత్వాన్ని చేకూరుస్తాయి.

ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన మరియు దేవి నవరాత్రుల సమయంలో ఈ ప్రాంతం భక్తజన సందోహంతో కిటకిటలాడుతుంది. శివరాత్రి నాడు జరిగే కళ్యాణోత్సవాలు మరియు నవరాత్రులలో అమ్మవారికి చేసే అలంకారాలు చూడటానికి రెండు కళ్లు సరిపోవు. ప్రకృతి ఒడిలో ముప్పై మూడు అడుగుల ఎత్తైన నంది విగ్రహం, ప్రాచీన గోపురాలు, మరియు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే వాతావరణం పర్యాటకులను సైతం కట్టిపడేస్తాయి. తరతరాలుగా శైవ, శాక్తేయ సంప్రదాయాలను మేళవించుకుని, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతున్న త్రిపురాంతక క్షేత్రం, ఆధ్యాత్మిక యాత్రలో ప్రతి ఒక్కరూ దర్శించాల్సిన పుణ్యభూమిగా విరాజిల్లుతోంది.

